ప్రజాశక్తి

మధ్యాహ్న భోజనానికి రూ.28 కోట్లు

- సిఎస్‌కె విజయానంద్ - కర్నూలులో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా 475 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న 1,48,149 మంది విద్యార్థులకు ' మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసేందుకు రూ.28 కోట్లు ఖర్చు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇంటర్మీడియట్ విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిఎస్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియేట్ విద్యార్థులకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి వరకు అమలు చేసిందన్నారు. ఇప్పటి నుండి ఇంటర్మీడియట్ విద్యార్థులకు కూడా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడం ద్వారా మేధో శక్తి, శారీరక బలంతో పాటు మానసిక వికాసం కలిగే అవకాశం ఉందని తెలిపారు. కర్నూలు జిల్లాలో ఉన్న 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న 8678 మంది విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ కూడా ప్రతిరోజు ఒకటే రకమైన మెనూ కాకుండా, రోజు కొక విధంగా ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ జిల్లాలోనే అత్యధిక విద్యార్థిని విద్యార్థులు బి.క్యాంపు కళాశాలలో ఉన్నారని కలెక్టర్ సిఎస్‌కు తెలిపారు.. మధ్యాహ్న భోజన పథకం ఇప్పటి వరకు పాఠశాలలలో మాత్రమే ఉండేదన్నారు. జిల్లాలో ఈ పథకం సమర్థవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం' కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేసారు.. సిఎస్‌తో పాటు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి విద్యార్థులతో కలిసి స్వీట్ పొంగల్, అన్నం, పప్పుచారు తో కూడిన భోజనాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి శామ్యూల్ పాల్, డిఎస్‌పి మహబూబ్ బాషా, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, కల్లూరు తహశీల్దార్ ఆంజనేయులు, కర్నూలు అర్బన్ తహశీల్దార్ వెంకటలక్ష్మి, డివిఇఒ వై.పరమేశ్వర రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సరళాదేవి, ఒకేషనల్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగస్వామి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించి విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న సిఎస్‌కె విజయానంద్, కలెక్టర్ రంజిత్ బాషా

విద్యార్థినులను వేధిస్తున్న వారిని తొలగించండి

- ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సిఎస్‌కు వినతి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో బనవాసి బాలికల గురుకుల కళాశాల విద్యార్థినిలను లైంగికంగా వేధిస్తున్న పురుష అధ్యాపకులపై తక్షణమే కేసులు నమోదు చేసి వెంటనే తొలగించాలని ఐద్వా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.అలివేలు, అబ్దుల్లా డిమాండ్ చేశారు. శనివారం కర్నూలుకు వచ్చిన సిఎస్ విజయానంద్‌కు ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ఎన్.అలివేలు, అబ్దుల్లా మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలం బనవాసి గ్రామంలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల కళాశాల బాలికల లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినిల పట్ల అధ్యాపకుడు మద్దిలేటి గ్రంథాలయంలో విద్యార్థినిలు పుస్తకాలు చదవడానికి వెళ్ళినప్పుడు వారితో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. అక్కడ పనిచేస్తున్న అధ్యాపకులు నారాయణస్వామి, శ్రీధరు కూడా విద్యార్థులకు ఎప్పుడు పడితే అప్పుడు క్లాసులు పెడుతున్నారన్నారు. విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ కూడా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. నారాయణస్వామి రమణ శ్రీధర్ సుజాత సుకన్యలతో పాటు ఇంకా విద్యార్థులకు ఇబ్బంది గురిచేసిన అధ్యాపకులపై కూడా ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సి ఎస్ స్పందిస్తూ వెంటనే ట్రైన్ కలెక్టర్‌ను సందర్శించి అక్కడ ఉన్న సమస్యలను విద్యార్థులతో మాట్లాడి రిపోర్ట్ పంపించాలని ఆదేశాలు ఇచ్చారన్నారు. రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు శ్యామల, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి నగర నాయకులు ఆర్యన్ తదితరులు పాల్గొన్నారు.

సిఎస్‌కెకు వినతి పత్రం అందజేస్తున్న ఐద్వా, ఎస్ఎఫ్ఐ నాయకులు

క్రీడా మైదానాన్ని పరిరక్షించాలి

- మైదానంలో నిర్మాణాలను తక్షణమే నిలిపేయాలి
- డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న
- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-పెద్దకడబూరు

పెద్దకడుబూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని ఫరిరక్షించాలని, అందులో చేపడుతున్న నిర్మాణపనులు తక్షణమే నిలిపివేయాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు జిల్లా పెద్దకడుబూర్ మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో చేపట్టుతున్న లాబ్, కంప్యూటర్, లైబ్రరీ గదుల నిర్మాణ పనులు ఆపేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రామన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులతో ల్యాబ్, లైబ్రరీ ఇతర అవసరాల నిమిత్తం గదుల నిర్మాణం చేపట్టడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే క్రీడామైదానంలో నిర్మాణం చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆంధ్రప్రదేశ్ లో క్రీడలను ప్రోత్సహించేందుకు పాలసీ ప్రకటించి నగదును పెద్ద ఎత్తున పెంచితే పెద్దకడబురులో దానికి భిన్నంగా అధికారులు, ప్రజాప్రతినిధులు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు నిద్రమత్తు వీడి ప్లేగ్రౌండ్‌లో నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల ఆవరణలో మరొక చోట గదుల నిర్మాణం చేపట్టాలన్నారు. క్రీడా మైదానాలను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని కోరారు. పోలాల్లో నుంచి నీరు పాఠశాల ఆవరణలోకి వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్నారు. తక్షణమే పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని క్రీడలను బతికించాలని, 700 మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం అడొద్దని కోరారు. తక్షణమే ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి అందజేశారు. అంతకు ముందు నిర్మాణ పనులు పరిశీలించారు. జిల్లా నాయకులు బి.దేవదాసు, ఎస్ఎఫ్ఐ నాయకులు విల్సన్, మద్దిలేటి, సతీష్‌లు మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దిలేటి, సతీష్, అర్జున్, అంజి, రాజేష్, పవన్, భాస్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణాలు ఆపాలని ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

అరుణోత్సాహం...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

సిపిఎం కర్నూలు జిల్లా 23వ మహాసభ ఎమ్మిగనూరు పట్టణంలో ఉత్సాహంగా జరిగింది. మొదటి రోజు కొత్త మున్సిపల్ కార్యాలయం ఆవరణ నుండి పోస్ట్ ఆఫీస్, కూరగాయల మార్కెట్, శ్రీనివాస టాకీస్ సర్కిల్, సోమేశ్వర్ టాకీస్ సర్కిల్, శ్రీ నీలకంఠేశ్వర దేవాలయం, బంగారు దుకాణాల సముదాయం, అంబేద్కర్ సర్కిల్ మీదుగా సోమప్ప సర్కిల్ వరకు ప్రజా ప్రదర్శన నిర్వహించారు. ఐద్వా కార్యకర్తలు కోలాటం వేస్తూ ర్యాలీ ముందు భాగాన నడిచారు. అలాగే డప్పు కళాకారులు డప్పు నృత్యం వేస్తూ సాగారు. అనంతరం సీతారాం ఏచూరి వేదిక మీద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజినేయులు అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. అనంతరం కామ్రేడ్ రాజేశ్వర్ రెడ్డి, కామ్రేడ్ సోమన్న ప్రాంగణంలో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. రాజేశ్వర్ రెడ్డి, సోమన్న చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి అంజిబాబు సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ ప్రారంభోపన్యాసం చేశారు. జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. అధ్యక్ష వర్గంగా పి.నిర్మల, టి.రాముడు, లక్ష్మన్న వ్యవహరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, వి.వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు విప్లవ గేయాలను ఆలపించారు. కర్నూలు జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని, తదితర 20 తీర్మానాలను మహాసభ ఆమోదించింది. మహాసభ సందర్భంగా 26 మందితో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. సిపిఎం కర్నూలు జిల్లా కార్యదర్శిగా డి.గౌస్ దేశాయ్ రెండోసారి ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా పి.నిర్మల, జి.రామకృష్ణ, పిఎస్.రాధాకృష్ణ, కె.వెంకటేశ్వర్లు, కెవి నారాయణ, ఎండి అంజిబాబు, ఎండి ఆనంద్ బాబు, టి.రాముడును ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా బి.రామాంజనేయులు, వై.నగేష్, సి.గురుశేఖర్, ఎం.రాజశేఖర్, ఎం.విజయ్, కె.అరుణ, ఎన్.అలివేలు, టి.నరసింహా, జె.మోహన్, డి.లక్ష్మన్న, కె.లింగన్న, పి.హనుమంతు, బి.వీరశేఖర్, సి.గోవిందు, నాగన్న, బాలకృష్ణను ఏకగ్రీవంగా మహాసభ ఎన్నుకుంది.

నష్టాల బాటలో శనగ : ప్రస్తుతం పప్పు శనగ పంట పూత దశలో ఉంది. పప్పు శెనగ విత్తనం వేసినప్పటి నుంచి ఇప్పటి వరకు పంటకు తెగుళ్ల అధికం కావడంతో రైతులు రెండు వారాలకు ఒకసారి రసాయన మందులు పిచికారి చేస్తూ పంటను కాపాడుకుంటూ వచ్చారు. ఈ ఏడాది గత ఏడాది కంటే పెట్టుబడులు రెండింతలు పెరిగాయి. గత ఏడాది రెండు, మూడుసార్లు మందులు స్ప్రే చేయగా, ఈ ఏడాది మాత్రం నాలుగు సార్లు నీళ్ల మందులు స్ప్రే చేశారు. వర్షాలు అధికంగా రావడంతో పైరులో రెండుసార్లు కలుపు తీయడం, రెండుసార్లు సేద్యం చేయడంతో పెట్టుబడి ఖర్చు పెరిగింది. గత వారం రోజుల వరకు శెనగ పైరు ఆశాజనకంగా ఏపుగా ఉండి, ఎకరాకు కనీసం 8 నుండి10 క్వింటాలు పైబడి దిగుబడి వస్తుందని రైతులు అంచనాలు వేస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆ అంచనాలు తారుమారు అయ్యాయి. తుఫాన్ ప్రభావం వల్ల కురిసిన చిరుజల్లులా లేక దట్టంగా కురుస్తున్న మంచు ప్రభావం వలనో కానీ శనగ చెట్టుకున్న పూత రాలి, పులుసు మొత్తం కారిపోతోంది. ఈ సారి పంట 4 నుండి 5 క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చేలా ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి ఇప్పటికే 20 వేల నుండి 30 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. మోస్తారు వర్షం కురిసినా పూత మొత్తం రాలిపోయి పైరు చేతికందకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వర్గీకరణపై వినతుల స్వీకరణ

షెడ్యూల్ కులాల్లోని ఉప కులాల వర్గీకరణపై కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఏకసభ్య కమిషన్ సభ్యుడు రాజీవ్ రంజన్ మిశ్రా పలువురు వ్యక్తులు, వివిధ సంస్థల నుంచి వినతులను స్వీకరించారు. మాలలకు న్యాయం చేయాలని మాల మహానాడు నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఎస్సీ వర్గీకరణ చేయాలని, క్రిమి లేయర్‌ను అమలు చేయాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. వర్గీకరణ చేయాలని బిఎస్‌ఎస్ నాయకులు, వర్గీకరణ చేయకూడదని పివి రావు మాలమహానాడు నాయకులు విన్నవించారు. రాజ్యాంగం ద్వారా వర్తించే అన్నీ అందించాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు, మాలలకు అన్ని విధాలుగా న్యాయం చేయాలని జాతీయ మాల మహానాడు నాయకులు వినతి పత్రం అందజేశారు. బేడ, బుడగ జంగాలను ఎస్సీల్లో కొనసాగించాలని బహుజన కాంగ్రెస్ పార్టీ, బేడ, బుడగ జంగాల నాయకులు విన్నవించారు. జనాభా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని ఎపి దళిత సమాఖ్య, 59 ఉపకులాల న్యాయవాదులందరికీ న్యాయం చేయాలని మాదిగ లాయర్స్ అసోసియేషన్ నాయకులు, తమను ఎస్సీలుగా గుర్తించాలని మాదాసి కురవ, మాదారి కురవ నాయకులు వినతిపత్రం సమర్పించారు.

అవీ..ఇవీ..అన్నీ..

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. 31వ తేదీ సాయంత్రం నుంచి సందడి మొదలైంది. అర్ధరాత్రి 12 గంటలకు నూతన సంవత్సరం ఆరంభం కాగానే యువత కేరింతలు, కేక్ కటింగ్‌లతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు పలువురు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

పింఛన్ల పరిశీలన చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో హెల్త్, డిజబుల్డ్ పింఛన్లను వెరిఫికేషన్ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ పింఛన్ల వెరిఫికేషన్ అంశంపై సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన వారికి హెల్త్, డిజబుల్డ్ పింఛన్లను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టిందన్నారు. ఈ నెల 6 నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. జిల్లాలో 413 మంది హెల్త్, డిజబుల్డ్ పింఛన్లు పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించేందుకు మూడు మెడికల్ టీములను ఏర్పాటు చేశారన్నారు. ఈ టీంలు 413 పింఛన్ దారుల ఇంటికి వెళ్లి వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు..

మునగాల పాడు పంపింగ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న రవీంద్రబాబు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజలకు రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అధికారులనుఆదేశించారు. శనివారం మునగాలపాడులోని తాగునీటి సరఫరా (పంపింగ్ స్టేషన్) కేంద్రాన్ని కమిషనర్ పరిశీలించారు. వేసవి కాలంలో తాగినీటి ఎద్దడి ఏర్పడకుండా, అవసరమైన మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. నిరుపయోగంగా ఉన్న మోటార్లను వెంటనే మరమ్మతులు చేపట్టి, అవసరమైన కొత్త యంత్రాలు, ఇతర మెట్రియల్ ఆవశ్యకత ముందుగానే గుర్తించాలని సూచించారు. కమిషనర్‌తోపాటు డిఇఇ నరేష్, ఎఇ ప్రవీణ్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎపిసిగా శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా టి.శ్రీనివాసులు శనివారం బాధ్యతలను స్వీకరించారు. కలెక్టరేట్లోని సమగ్ర శిక్ష అభియాన్ ఎపిసి చాంబర్లో బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను సెక్టోరియల్ ఆఫీసర్స్ కార్యాలయ ఉద్యోగులు సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా అమలవుతున్న కార్యక్రమాలను పక్కాగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్‌పాల్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఇస్రో నోడల్ ఆఫీసర్‌గా క్లస్టర్ రిజిస్ట్రార్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇస్రో (స్టార్ట్)స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ అవగాహన , శిక్షణ ఆన్‌లైన్ కోర్సులు నిర్వహించుటకు క్లస్టర్ యూనివర్సిటీని నోడల్ ఆఫీసుగా క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. యుజిపిజి విద్యార్థుల కోసం ఈ ఆన్‌లైన్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఎంతో ప్రయోజనాన్ని ఇస్తుందని, ఇలాంటి అవకాశం క్లస్టర్ యూనివర్సిటీకి రావటం సంతోషకరమని వైస్ ఛాన్సలర్ ఆచార్య డివిఆర్ సాయి గోపాల్ అన్నారు. ఈ శిక్షణ ఈనెల 9 నుండి జనవరి చివరి వరకు జరుగుతుందన ఆసక్తిగల డిగ్రీ చదువుతున్న విద్యార్థులు క్లస్టర్ యూనివర్సిటీని సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు తెలపారు.

జూనియర్ కాలేజీల్లో డొక్కా సీతమ్మ పథకం ప్రారంభం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ ప్రభుత్వం జూనియర్ కళాశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటర్ పేద విద్యార్థుల కోసం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ , ఆర్‌డిఒ భరత్ నాయక్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇంటర్ విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించామన్నారు. ఇంటర్ విద్యార్థుల ప్లేట్ల కోసం రూ.40 వేలు కళాశాల ప్రిన్సిపల్‌కు నగుదను ఎమ్మెల్యే అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ వీరేశప్ప, తెలుగు యువత అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, ఎంఇఒ రమేష్, మైత్రి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రామ్మోహన్ పాల్గొన్నారు.

జూనియర్ కాలేజీ విద్యార్థులో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శ్యామ్‌కుమార్

కర్నూలు కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రత్యేక దష్టి సారించిందని, అందులో భాగంగానే ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని పునః ప్రారంభించినట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు తెలిపారు. పాతబస్తీలోని ప్రభుత్వ మైనారిటీ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కమిషనర్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి కమిషనర్ భోజనం చేశారు.

టౌన్ మోడల్ కాలేజీలో భోజనం వడ్డిస్తున్న బిటినాయుడు, సోమిశెట్టి

కర్నూలు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వ డొక్కా సీతమ్మ మధ్యాహ్నన భోజన పథకాన్ని కర్నూలు ప్రభుత్వ జూనియర్ కళాశాల (టౌన్ మోడల్)లో కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బిటి నాయుడు, కెవి సుబ్బారెడ్డి విద్యా సంస్థల అధినేత డాక్టర్ కె వి సుబ్బారెడ్డి, డిఆర్ఒ, ఎండిఒ, కళాశాల ప్రిన్సిపల్ సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

క ం : కర్నూలు పట్టణంలోని ప్రభుత్వ మైనార్టీ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆంధ్ర రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ప్రారంభించారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సబీహా పర్వీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కర్నూలు కమిషనర్ రవీంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీ కాలేజీలో ముస్తాక్ అహ్మద్, కమిషనర్, తదితరులు

కాలుష్యాన్ని పెంచుతున్నారు

-గతేడాది రోడ్డు తవ్వీ..వదిలేశారు! రూ. 60 లక్షలు ఏం చేశారు?
- ప్రజల ఆరోగ్యం పట్టదా..! స్థానికుల ఆగ్రహం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఒకవైపు గుంతలు పడ్డ రోడ్డు.. మరోవైపు చెత్త దిబ్బలు.. ఆ చెత్త దిబ్బలను తగలబెట్టడంతో ఆ రోడ్డుపై నడవలేక దుర్వాసనతో అనారోగ్యాలకు గురవుతున్నా.. స్పందించడం లేదని కొత్త బస్టాండు, సీతారామ నగర్ ప్రాంతం కాలనీల ప్రతినిధులు ఎస్.శ్రీనివాసరావు, వై.లక్ష్మయ్య, ఎ.ఉదయరాజు, టి.శంషుద్దీన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతారామ నగర్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ మీదుగా కొత్త బస్టాండ్ వెళ్లే దారిలో శనివారం పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందంతో కలిసి స్థానికులు పర్యటించారు. వారు మాట్లాడుతూ రోడ్లపై చెత్త దిబ్బలను తగలబెడుతున్నందున దుర్వాసన, పొగ, వల్ల అనారోగ్యానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నగరపాలక సంస్థ అధికారులు స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎ. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గతేడాది ఫిబ్రవరిలో రూ.60 లక్షలతో సిమెంట్ రోడ్డు వేసేందుకు రోడ్డును తవ్వి వదిలేసారని ఆ రూ.60 లక్షలు ఏమయ్యాయని ప్రశ్నించారు?. రోడ్డు పక్కన రోడ్డు వేస్తున్న అధికారులు, అసలు రోడ్డే లేని చోటరోడ్డు వేయడం లేదన్నారు. 400 మందికి పైగా పారిశుధ్య సిబ్బంది..చెత్తను తరలించేందుకు 100కు పైగా వాహనాలు ఉన్నప్పటికీ ఆరోగ్యశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అనేక ప్రాంతాల్లో చెత్త పేరుకనుపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని విమర్శించారు.ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు, పాలకవర్గం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వారిశుధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ఆ ప్రాంతంలో సిమెంట్ రోడ్డు వెంటనే వేయాలన్నారు. ఈ పర్యటనలో పిపిఎస్ఎస్ నాయకులు ఎం. నాగరాజు, సివివర్మ, కె.శీను, ఎండి. యూనుస్, వివిధ కాలనీల ప్రతినిధులు న్యాయవాది జి.రాము, ఎం.సుబ్రహ్మణ్యం, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్. జయప్రకాశ్ రెడ్డి, జి శివ ప్రసాద్ చౌదరి, టి. పురుషోత్తం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం వెదజల్లే మంటలను పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

సైన్స్‌ఫేర్ ప్రారంభ సభలో మాట్లాడుతున్న డిఇఒ శామ్యూల్ పాల్

జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు మండలం పడిదంపాడు రోడ్డులోని రవీంద్ర గ్లోబల్ స్కూల్లో నేడు జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. డిఇఒ శామ్యూల్ పాల్, ఉప విద్యాశాఖాధికారి హనుమంతరావు ఐఎఎస్‌సి ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి , కర్నూలు మండల విద్యాశాఖ అధికారి వినోద్ కుమార్ పాల్గొన్నారు. రవీంద్ర గ్లోబల్ స్కూల్ సిఇఒ జి.వంశీధర్ ఆధ్యక్షతన నిర్వహించారు. డిఇఒ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగివున్న మేదస్సును ఇలాంటి సైన్స్ ఫెయిర్ కార్యక్రమాల ద్వారా బయటికి తీసి మానవాళికి ఉపయోగపడే నమూనాలను సిద్ధం చేయాలన్నారు. ప్రతి విద్యార్థిలో కూడా ఎన్నో ఇన్నోవేషన్ ఐడియాలు దాగి ఉన్నాయని,అలాంటి విద్యార్థుల ఐడియాలను వెలికి తీయవలసిన గురుతర బాధ్యత ఉపాధ్యాయ వర్గంపై ఉందన్నారు. ఉప విద్యాశాఖ అధికారి హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞాన విషయాలపై దృష్టి సాగించాలని తెలిపారు. రవీంద్రగ్లోబల్ స్కూల్ సిఇఒ జివంశీధర్ మాట్లాడుతూ చిన్నప్పటి నుండే విద్యార్థిలో పరిశీలన శక్తిని వృద్ధి చేస్తూ వారి ఆలోచనలను అద్భుతమైన ఆవిష్కరణలుగా మలచాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను పరిశీలించి న్యాయ నిర్ణయతలు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లే జట్లను ప్రకటించారు. ముగింపు కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ గతంలో మన కర్నూలు విద్యార్థులు చదువుకోవడానికి సరైన పాఠశాలలు ఉండేవి కావన్నారు. ఇప్పుడు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఎక్సైజ్ అధికారులపై చర్యలు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్, జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర డిమాండ్ చేశారు. శనివారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ ,మండల అధ్యక్షులు సురేష్ తో కలిసి పత్రిక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను అరికట్టాలని నవంబర్ 24న అధికారులకు వినతిపత్రం అందజేశామన్నారు. నెలరోజులు పూర్తయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. చాలా రోజుల నుండి ఇళ్లల్లో రహస్యంగా నిర్వహించే బెల్ట్ షాపులు కూటమి ప్రభుత్వం పుణ్యమా అని ప్రధాన రహదారిలో దాబాలను తలపించేలాగా నిర్వహిస్తున్నారని విమర్శించారు. అధికారుల దృష్టికి తీసుకు వెళ్ళకు ముందు ఇళ్లల్లో నిర్వహించిన నిర్వాహకులు ఇప్పుడు ప్రధాన రహదారిలో నిర్వహించడంలో అంతర్యం ఏమిటో అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకుని, మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామస్తులతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

గెలిపించినా గుర్తింపేదీ?

- ఆయోమయంలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి - నందవరం

సార్వత్రిక ఎన్నికలలో నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు కృషి చేసిన మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు తమకు పార్టీలో సరైన గుర్తింపు లేక ఆయోమయంలో ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం తమదే ఉన్నా తమ పనులు జరగక నిరాశతో ఉన్నారు. నందవరం గ్రామంలో టిడిపి నాయకులు పూర్తి నిరాశతో ఉన్నట్లు కార్యకర్తలు మాట్లాడుకుంటున్నారు.టిడిపి సీనియర్ నాయకులు సొంతపార్టీ నిర్ణయాల పట్ల తీవ్రమైన వ్యతిరేకతతో ఉన్నట్లు తెలుస్తుంది. 2017లో మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని నందవరం గ్రామానికి చెందిన సీనియర్ నాయకునికి అప్పటి టిడిపి ప్రభుత్వం కేటాయించింది. మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిపై స్టే రావడంతో ఆ నాయకునికి పదవి దూరమైపోయింది. ఆ పదవి దూరమైనా ఆయన మాత్రం పార్టీనే నమ్ముకుని వైసిపి ప్రభుత్వ ఐదేళ్ల పాలనను ఎదుర్కొంటు ప్రస్తుత టిడిపి గెలుపునకు కృషి చేశారు. ఇప్పుడైనా తిరిగి పదవి వస్తుందని ఆశిస్తున్నారు. కానీ కొద్ది రోజుల క్రితం ఎమ్మిగనూరులో జరిగిన ఒక సమావేశంలో వేరే వర్గానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని ఇస్తున్నట్లు ప్రకటన చేశారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నిర్ణయం ఆ నాయకుడు నిరాశ చెందినట్లు కార్యకర్తలు చెబుతున్నారు. అదేవిధంగా మండలంలోని మరికొంత మంది నాయకులు నిరాశలో ఉంటూ అంటి అంటున్నట్లు పార్టీ కార్యక్రమాలకు హాజరవుతున్నారని సమాచారం. నందవరం గ్రామంలో వేరే గ్రామ నాయకులు ఆధిపత్యాన్ని చలాయిస్తున్నారని,వేరే గ్రామ నాయకులకు గ్రామంలో కొన్ని పదవులను కేటాయించారని ఆ విషయంపైన గ్రామ టిడిపి నాయకులు ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. నందవరం జిల్లా పరిషత్ స్కూల్ మధ్యాహ్న భోజన ఏజెన్సీని ఎమ్మిగనూరు వ్యక్తులకు కేటాయించంగా గ్రామ టిడిపి నాయకులు విమర్శలు చేయడం వలన ఆ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో స్థానిక సంస్థ ఎన్నికల్లో టిడిపికి ఎదురుగాలి వీచే అవకాశం ఉందని ప్రజలు మాట్లాడుకుంటున్నారు. కనకవీడు గ్రామంలో టిడిపి నాయకుల అంతర్గత పోరు వలన టిడిపికి గడ్డు కాలమే ఏర్పడింది. అదేవిధంగా మొన్న జరిగిన సొసైటీ ఎన్నికల్లో టిడిపి పూర్తిస్థాయిలో విజయం సాధించలేకపోయింది. అంతర్గత పోరు వల్ల కనకవీడు విద్యా కమిటీ చైర్మన్ ఎన్నిక ఇప్పటికీ జరగలేదు.

డీలర్లకు అదే పరిస్థితి..

రేషన్ డీలర్ల పరిస్థితి కూడా అయోమయంగానే ఉంది. మండలంలోని చాలా గ్రామాలలో రేషన్ డీలర్లను ఇప్పటికీ ఎంపిక చేయలేదని తెలుస్తోంది. ప్రభుత్వం మారినా పాత వారే రేషన్ డీలర్లగా కొనసాగుతున్నారని కొన్ని గ్రామాలలో టిడిపి నాయకులు బాధపడుతున్నట్లు తెలుస్తుంది. నందవరంలో అయితే రేషన్ డీలర్ల పరిస్థితి విచిత్రంగా తయారైంది. ఒక్క డీలర్ షాపులో ఇద్దరు వ్యక్తులను నియమించినట్టు తెలుస్తుంది. అది కూడా టిడిపి ఒక వర్గంలో ఒకరిని, మరొక వర్గంలో ఒకరిని నియమించారు. దీంతో టిడిపి నాయకులు, రేషన్ డీలర్ మధ్య విభేదాలు ఏర్పడ్డాయని తెలుస్తుంది.

చదువులో రాణిస్తేనే ఉన్నత శిఖరాలకు

- ఎమ్మెల్యే బూసినె విరుపాక్షి

ప్రజాశక్తి-చిప్పగిరి

విద్యార్థినీ విద్యార్థులు అందరూ కూడా మంచి భవిష్యత్తు, ఉండాలంటే చదువులో రాణించాలని అప్పుడే మంచి ఉద్యోగంతో ముందుకెళతారని ఎమ్మెల్యే బూసినె విరుపాక్షి తెలిపారు. శనివారం చిప్పగిరి ప్రభుత్వ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనాన్ని ఆయన ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు అధ్యక్షతన ఎమ్మెల్యే వైసిపి కన్వీనర్ జూటూరు మారయ్య, సర్పంచ్ దాసరి గోవిందరాజులు, ఎంపీటీసీ రజని విద్యార్థులకు భోజనం వడ్డించి ప్రారంభోత్సవం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు అలవాటు పడకుండా పేరు తెచ్చుకునేలా ముఖ్యంగా గురువులు బోధించే ప్రతి అంశమును క్షుణ్ణంగా చదువుకొని పట్టుదలతో ముందుకెళితేనే మన భవిష్యత్తు బంగారుమయం అవుతుందన్నారు. ఇదే చిప్పగిరి కళాశాలలో చదువుకున్న వారు మంచి ఉద్యోగాల్లోఉన్నారన్నారు. వారిని ఆదర్శంగా తీసుకుని బాగా చదువుకొని మంచి ప్రయోజకులు అవుతారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, ఎంఈఓలు చిరంజీవమ్మ, శ్రీనివాస్ రెడ్డి, జనసేన మండల కన్వీనర్ చిరంజీవి, నాయకులు ధర్మేంద్ర, పోతురాజు రాముడు, బోగేష్ హెచ్ఎం లతీఫ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూసినె విరుపాక్షి

సంక్షేమం, అభివృద్ధే టిడిపి లక్ష్యం

- ఎంపీ బస్తిపాటి నాగరాజు

ప్రజాశక్తి- దేవనకొండ

గత వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విధ్వంసకరపాలన జరిగిందని, ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలు చేసిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల శర్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఉన్నత చదువులు చదవలేని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, విద్యార్థుల డ్రాప్ అవుట్ నివారణకు మధ్యాహ్న భోజన పథకము ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి పారిశ్రామికంగా అభివృద్ధి చేసే దిశలో ఎన్డీఏ ప్రభుత్వము భాగస్వామ్యం అయ్యిందన్నారు. కర్నూలు - బళ్లారి రహదారి నేషనల్ హైవే, పత్తికొండ ప్రాంతంలో టమోటా జ్యూస్ ఏర్పాటు కారిడార్ పారిశ్రామిక హబ్‌గా కర్నూల్ జిల్లా ఓర్వకల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లోకేశ్వరరావు, సిఐ వంశీనాథ్, ఆలూరు జనసేన పార్టీ ఇన్చార్జి వెంకప్ప, మండల మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, టిడిపి మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, టిడిపి నాయకులు ఉచ్చిరప్ప, బడి గింజల రంగన్న, ఆకుల వీరేష్, రాజాసాబ్, జనసేన బిజెపి నాయకులు వీరేష్, రవికుమార్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ

- డిప్యూటీ డిఇఓ వెంకట రమణా రెడ్డి

ప్రజాశక్తి-ఆదోని రూరల్

అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని ఆదోని డిప్యూటీ డిఇఓ వెంకట రమణారెడ్డి, మండల విద్యాధికారి పి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక తిరుమల్ నగర్లో భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ 217వ జయంతిని ఘనంగా నిర్వహించారు. వారు మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ భవిష్యత్తు తరాల గురించి ఆలోచించి అంధ సమాజం కోసం ముందుచూపుతో ఆలోచించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.నిర్మలమ్మ, విజయలక్ష్మి, ఆదోని ప్రభుత్వ ఆసుపత్రి ఎర్లీ ఇంటర్వెన్షన్ పరమేష్, భవిత కేంద్రం నిర్వాహకులు ఎం.శాంత కుమార్, బి.మౌనిక, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో టిడిపిని బలోపేతం చేద్దాం

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలు ప్రజలకు వివరించి క్షేత్ర స్థాయిలో టీడీపీ లో చేర్పించి పార్టీని బలోపేతం చేద్దామని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమపతి నాయుడు తెలిపారు. ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో 42వ వార్డు, హనుమాన్ నగర్‌లో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉమాపతి నాయుడు మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. పార్టీ సభ్యత్వాన్ని తీసుకున్న వారికి రూ. 5 లక్షల ప్రమాద బీమా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రంగస్వామి నాయుడు, రామస్వామి, కృష్ణారెడ్డి, బాబు నాయుడు, రంగన్న, శ్రీనివాస్ చౌదరి, బిచ్చ అంజనప్ప, రంగన్న, నరసింహులు, బ్రహ్మానందం, హరి, ప్రభు స్వామి, భీమ్ లింగ, మహానంది, శంకర్ ఉన్నారు.



ఆదోనిలో సభ్యత్వం చేర్పిస్తున్నటిడిపి నాయకుడు ఉపాపతి నాయుడు

ఇష్టంతో చదవాలి

- టిడిపి ఇంఛార్జి మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి-ఆదోని

కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మెరుగైన జీవితానికి బాటలు వేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడు విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మున్సిపల్ చైర్పర్సన్ శాంత, జనసేన ఇన్చార్జి మల్లప్పతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మీనాక్షి నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం భోజనంలో పదార్థాలు రుచికరంగా ఉండేలా శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ సంజన్న ఆదేశించారు. రోజువారీగా ఆహార పదార్థాలను పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. మంచి సంకల్పముతో సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు తిమ్మప్ప, కలబావి మల్లికార్జున, కునిమల్లా సైదుల్లా, పులి రాజు, రామస్వామి, అల్తాఫ్ఫీన్, లక్ష్మీనారాయణ, సుబ్బు, చాంద్, ఎన్‌సిసి అధికారి గోవిందరాజులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి ఇంఛార్జి మీనాక్షి నాయుడు

మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల లోని విద్యార్థులకు చేపట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మండల కేంద్రమైన గోనెగండ్ల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంఇఒ లు రామాంజనేయులు.నీలకంఠ. ప్రిన్సిపల్ జి జ్యోతి .టిడిపి నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. విద్యార్థులకు వారు స్వయంగా భోజనాన్ని వడ్డించారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఎన్ వి రామాంజనేయులు తిరుపతయ్య నాయుడు మేజర్ సర్పంచ్ హైమావతి మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని వైకాపా ప్రభుత్వం తొలగించి విద్యార్థుల పొట్ట కొట్టిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వ కళాశాలల లోతిరిగి అమలు చేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత కూటమి ప్రభుత్వము ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దక్కుతుందని అన్నారు.ఈ పథకాన్ని మండలంలోని వివిధ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఉపయోగించుకొని చదువులో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ షాహినా పర్వీన్ వైస్ ప్రిన్సిపల్ పద్మావతి జూనియర్ కళాశాల అధ్యాపక బందం మరియు టిడిపి నాయకులు శ్రీధర్ నాయుడు కులుమాల రాముడు నూరహమ్మద్ అచ్చుగట్ల ఫక్రుద్దీన్ గాజులదిన్నె ప్రభాకర్ చంద్రన్న పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లను అందరూ దిగ్విజయం చేయాలి

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

కులాలకు అతీతంగా అందురు కలసి కట్టుగా జరుపుకొనే శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర మహోత్సవం చుట్టూ ముట్టు ప్రాంతాల గ్రామాలు ప్రజలు అంత్యంత వైభవంగా నిర్వహించనున్నారని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ లో ఏర్పాటు చేసిన శ్రీ నీలకంటేశ్వర స్వామి జాతర మహోత్సవం ఏర్పాట్లు విషయం పై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతర ఉత్సవాలు ఏర్పాట్లు విషయంపై ఎండో మెంట్ అధికారులు, వంశపరంగా దేవాలయం ధర్మ కర్తలు,. వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి చర్చించారు. ఎమ్మెల్యే బివి మాట్లాడుతూ జాతర ఉత్సవాలు ఏర్పాట్లు గతంలో కన్న ప్రజలు ఏలాంటి ఇబ్బందులు గురి కాకుండా ప్రదాన కూడలిలో ఎల్ ఈడి స్క్రీన్లు శ్రీనివాస సర్కిల్. సోమేశ్వర ట్యాకీస్. ఎదురు బసన్న గుడి. తేరుబజార్ నాలుగు చోట్ల అమర్చాలని డ్రోన్లు ఏర్పాటు చేయాలని వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. మరుగుదొడ్లు. మంచినీటి సౌకర్యం. ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జాతరలో తాత్కాలిక షెడ్లు నిర్మించిన వాటిపై వసూలు ఎండో మెంట్ పెత్తనాన్ని సడలించి ధర్మ కర్తలకు పెత్తనాన్ని ఇవ్వాలని దేవాలయ ధర్మ కర్తలు ఎమ్మెల్యే బివి ధృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి. శానిటేషన్ శ్రీనివాసులు. దేవాదాయశాఖ అధికారులు రాంప్రసాద్. ఎం. శివ కేశవులు. ఆచారి. దేవాలయం ధర్మ కర్త నీలం మురళీధర్,. దేవాలయ వంశీకులు మాచాని శివశంకర్. శ్రీకాంత్. ఎంబి. రాజు. ఎంబి .మహేష్. డిఎస్పి ఉపేంద్ర బాబు. టౌన్ సర్కిల్ ఇన్స్ స్పెక్టర్ వి. శ్రీనివాసులు. ఎఎస్ఐ డాక్టర్ నాయక్. రూరల్ సర్కిల్ ఇన్స్‌స్పెక్టర్ బివి. మదుసుదనరావు. ఎఎస్ఐ శ్రీనివాసులు. ఆర్ అండ్ బీ డిఇఇ నాగరాజు. విద్యుత్ అధికారులు ఎడి నాగేంద్ర ప్రసాద్,. ఎఇ ప్రసన్న ఆంజనేయులు. విద్య. వైద్యాధికారులు. తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బివి జయనాగేశ్వర్‌రెడ్డి

రజకుల అభ్యున్నతికి సహకరించండి

- మంత్రి సవితకు రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ వినతి

ప్రజాశక్తి - ఆదోని

రజకుల కఅభ్యున్నతికి పాటుపడాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితకు రజక కార్పొరేషన్ చైర్పర్సన్ సావిత్రి వెలగపూడి సచివాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. రజకుల అభివృద్ధి కోసం గతంలో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ఇప్పటికి అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వ హాస్పటల్స్, పోలీస్ శాఖ, రెసిడెన్షియల్ స్కూల్స్, ఆయా దేవాలయలలో దోబీ పోస్టులు రజకులకు కాకుండ ఇతర కులాల వాళ్ళకు కేటాయిన్నారన్నారు. పంచాయితీ, మున్సిపాలిటి మున్సిపాల్ కార్పోరేషన్ల కాంప్లెక్స్‌లలో ల్యాండ్రిలకు షాపులు కేటాయించడం లేదన్నారు. రజకుల అభివృద్ధికి దోహదపడే జీవోలు అమలు జరిగేలా ప్రభుత్వం శ్రద్ధ చూపాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి - తుగ్గలి

పగిడిరాయి గోల్డ్ మైన్స్‌కు జొన్నగిరి మీదుగా తీసుకెళ్తున్న పైప్‌లైన్ నుంచి పైపులు ఏర్పాటు చేసి జొన్నగిరి చెరువు నింపాలని గ్రామస్థులతో కలిసి సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు, సిపిఎం నాయకులు కొండారెడ్డి, రంగరాజు, జొన్నగిరి సచివాలయంలోని పంచాయతీ సెక్రెటరీకి వినతి పత్రం అందజేశారు. జొన్నగిరి గ్రామంలో చాలా కాలం నుంచి తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని, వేసవికాలంలో ప్రతి కుటుంబం నీటిని కొనుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. తోటల్లో బోరు బావి దగ్గరికి ఎడ్ల బండి పై డ్రమ్ములు పెట్టుకుని నీళ్ల తెచ్చుకుంటున్నారని, నీటి కొరత ఉండడంతో ఉద్యోగస్తులు గ్రామంలో ఉండడానికి ఆలోచిస్తున్నారని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కార కోసం మీరు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామ ప్రజలు హనుమన్న, గుంతా రాముడు, బాలు, వి నారాయణస్వామి ఉన్నారు.

క్రీడలు చైతన్యాన్ని కలిగిస్తాయి

ఎస్‌వి మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, చైతన్యాన్ని కలిగిస్తాయని మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎపిఎస్‌పి సెకండ్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషాతో కలిసి పీస్ ఇంటర్నల్స్ స్కూల్ వారి స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్నారు. ఎస్‌వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడల మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇతరుల కన్నా క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. మహబూబ్ బాష మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడలు పోలీస్ సెలక్షన్లలో ప్రధాన భూమిక పోషిస్తాయని, అందుకొరకే ప్రతి విద్యార్థి క్రీడల పట్ల అవగాహన పెంచుకొని చక్కగా చదువుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ నాసిర్, పత్తబాష, కిషన్, రాజశేఖర్, అశోక్, మునీర్ బాష,సోహెయిల్, బుల్లెట్ బాష, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రజాశక్తి-ఆదోని రూరల్

ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నారాయణపురం సర్పంచ్ అల్లమ్మ గారి సరళమ్మ, అల్లమ్మ గారి పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. వారి ఆధ్వర్యంలో శనివారం గ్రామంలో స్వచ్ఛత పనులు చేపట్టారు. వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల చేత మురికికలువ వద్ద నీళ్ళు నిల్వ లేకుండా శుభ్రపరిచి ఎలాంటి అంటు వ్యాధులు, దోమలు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా శుభ్రత పనులు చేపట్టామన్నారు. గ్రామస్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. మంచినీటి ట్యాంక్‌లను పారిశుధ్య కార్మికులు చేత శుభపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

ఆర్‌బికె భవనం, సి సి రోడ్ల ప్రారంభం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామంలో రూ.పది లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, రూ 22.95 లక్షలు తో నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ప్రారంభించారు. అనంతరం రూ.38 లక్షలతో నిర్మించే ఆసుపత్రి అదనపు భవన నిర్మాణానికి, రూ 5.35 బక్షాలతో నిర్మించే పార్కు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలలో ఎపి అర్బన్ డెవలప్మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రామాంజనేయులు, ఎంపిడిఒ జిఎన్ఎస్ రెడ్డి, ఇఒఆర్‌డి నగేష్, మండల ఎఇ శ్రీనివాసరెడ్డి ఆర్ అండ్ బి అధికారులు పంచాయతీ రెవెన్యూ కార్యదర్శులు సచివాలయం ఉద్యోగులు గ్రామస్తులు పాల్గొన్నారు. సంత మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన సభలో టిడిపి క్లస్టర్ ఇంచార్జి మాదేశ్ తో పాటు యూనిట్ ఇన్చార్జీలు షేక్షావలి విక్రమ్ బూతు ఇన్చార్జిలు యుద్ధం శ్రీకాంత్ కరీం మద్దయ్య మహేంద్ర రమణ కలాంలను ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఘనంగా సత్కరించారు. ఉలిందకొండ గ్రామంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు 2120 మంది కార్యకర్తలకు అందించి నియోజకవర్గంలోనే మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ పటిష్టత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

మీడియా స్వేచ్ఛ అణచి వేత తగదు

సిఎస్ విజయనంద్ ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

ప్రజశ్శక్తి-కర్నూలు కలెక్టరేట్

మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా కర్నూలు పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధిస్తున్నారని మీడియాలో వచ్చిన కథనాలపై విచారణ లేకుండానే నోటీసులు ఇస్తున్నారని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు గోరంట్లప్ప, జిల్లా కన్వీనర్ కె.నాగేంద్ర, ఫోటో గ్రాఫర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డి.హుసేన్ ,నాయకులు బ్రహ్మయ్య, ఎర్రమలలు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. శనివారం కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా వచ్చిన ఆయనకు ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు పలు సమస్యలతో కూడిన వినతిని అందించారు. నిబంధనల ప్రకారం మీడియాలో వచ్చిన కథనాలపై రిజాండర్ ఇచ్చి తదుపరి విచారించి ఆపై చర్యలు తీసుకోవాలని నిబంధనలున్నాయని పేర్కొన్నారు. ఇక్కడ మీడియాను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఉందన్నారు. వార్తలు రాసిన 24 గంటల్లో ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది పూర్తిగా పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే అన్నారు. గత నెల ఆదోని, కర్నూలు పత్తికొండలో పని చేస్తున్న వివిధ పత్రికల జర్నలిస్టులు రాసిన వార్తలకు నోటీసులను ఇచ్చారన్నారు. అదోనిలో వన్ టౌన్ పోలీసులు మామూళ్ల వసూళ్ల చేస్తున్నారని ప్రజాశక్తి దినపత్రికలో రాసిన వార్తకు స్టాఫ్ రిపోర్టర్ వినయ్ కుమార్‌కు ,ఆదోని వన్ టౌన్ వారు, ఆదోని రూరల్ పోలీస్ వారు నోటీస్‌లు ఇచ్చారు. కర్నూలు నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో నవంబర్ 11న బోరుగడ్డ అనిల్ కు మళ్ళీ రాచ మర్యాదలే శీర్షికతో రాసినందుకు వార్త దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ రవి ప్రకాష్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారని తెలిపారు. ఆలూరు లో టివి 9 ,పత్తికొండ లో ఆంధ్రప్రభ, హంస వాయిస్, విశాలాంధ్ర, జర్నలిస్టులకు నోటీస్ లు ఇచ్చారన్నారు. నేడు పోలీస్ లే కిడ్నపర్ అవతారం ఎత్తి అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో రాసిన వార్త కు పోలీస్ లు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేశారని పేర్కొన్నారు. ఈ కేసులు నమోదు చేయడం అనేది బెదిరింపులకు గురిచేయడం తప్ప ఇంకొకటి కాదన్నారు. ఇలాంటి ధోరణి ని పోలీస్ అధికారులు చేయడం బాధాకరమన్నారు. వార్తలు రాసిన వాటిపై విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం మానేసి పత్రిక గొంతు నొక్కడం సమంజసం కాదన్నారు. జర్నలిస్టుల రక్షణ కోసం పోలీస్ లు హామీ ఇచ్చేలా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమె ఇలాంటి చర్యలు విరమించుకోవాలని సిఎస్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు. తగు చర్యలు తీసుకుని జర్నలిస్టుల విధులకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు.



సిఎస్ విజయనంద్‌కు వినతిపత్రం ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

పబ్లిక్ నోటీసు

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడము ఏమనగా మల్లెపోగు మాదన్న S/o మల్లెపోగు బజారి, పిల్లిగుండ్ల గ్రామం, గోనెగండ్ల మండలం, వారు క్రింది తెలిపిన షెడ్యూల్ ఆస్థి ని కారుమంచి షరీఫా బీ W/o. చాంద్ బాష, వారి నుండి విక్రయం పొందిఉన్నారు, సదరు ఆస్తి ని 16/07/2024 వ తేదిన మల్లెపోగు మాదన్న, గారి పేరున ఎమ్మిగనూర్ స.రి.ఆ .లో 1వ పుస్తకము ద.నెం.13278/2024 గా రిజిస్టరు చేయించియున్నారు. మరియు సదరు దస్తావేజు యొక్క లింక్ డాక్యుమెంట్ నెంబర్ : 15389/2022, తేది 02/12/2022 మరియు సదరు దస్తావేజు యొక్క లింక్ డాక్యుమెంట్ నెం. 2734/2001, తేది 15/09/2001, ద్వార పొందినారు సదరు మల్లెపోగు మాదన్న S/o మల్లెపోగు బజారి, పిల్లిగుండ్ల గ్రామం, గోనెగండ్ల మండలం, వారు షెడ్యూల్ ఆస్తి కి సంబందిచిన లింక్ డాక్యుమెంట్ నెంబర్: 2734/2001, తేది 15/09/2001, గల డాక్యుమెంట్ పోయినవి .ఈ డాక్యుమెంట్ కి సంబందించిన సర్వాధికారములు నా క్లయింట్ కు కలవు. ఈ ఆస్తి పై ఎవ్వరికైనా ఎలాంటి హక్కు కానీ అధికారము కానీ ఆక్షేపణలు ఉన్న ఎడల ఈ ప్రకటన వెలువడిన 7 రోజుల లోపల ఈ క్రింది అడ్రెస్ న్యాయవాదిని కలిసి మీ యొక్క హక్కులు కానీ అధికారములు ఆక్షేపణలు కానీ నిరూపించుకొనవలెను. లేని ఎడల ఏలాంటి ఆక్షేపణలు లేవు అని బావించ బడును .అని యావన్మందికి తెలిపరచడమైనది.

కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు పట్టణం లోని ఆస్తి

వివరములు :-

ఇంటి నెంబర్ : 18-100-1 నెంబర్ గల Ground Floor & First Floor R.C.C. ఇల్లు సర్వే నంబరుబీ 232 పైకి,

స్థలం కొలతలు:-

తూర్పు: పడమర: 12 అడుగులు
ఉత్తరం: దక్షిణం 36 అడుగులు
విస్తీర్ణం: 48 చ. గ

చెక్కుబంది :

తూర్పు : బి. పద్మావతి ఆస్తి, ఉత్తరం: పెద్ద నాగన్న ఆస్తి
పడమర: రోడ్డు దక్షిణం : రోడ్డు

ఇట్లు
ANGADI DINESH, Advocate
18/461-1, 1st Floor,
Sri Lakshmi Devi Complex,
Court Road, Yemmignaur-518360
Mobile : 9949390767, 7989749530
Bar Counsel Number AP/1394/2020